
సాక్షి
అనంతపురం
శుక్రవారం, 15, ఆగస్టు, 2025



టన్ను చీనీ రూ.19 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



ఎస్ఐ రాజశేఖర్‌పై వేటు
గిరిజన మహిళను లైంగికంగా వేధించిన పట్నం ఎస్ఐ రాజశేఖర్‌ను సర్వీసు నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

గరిష్టం/కనిష్టం
29.8°/21.1°

జిల్లా అంతటా గురువారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో ఆగ్నేయం నుంచి పశ్చిమ దిశగా గాలి వీచింది.

జగన్.. నీరాజనం

జన తరంగం ఎగసింది. అభిమాన నేతను చూసి మురిసిపోయింది. సంక్షేమ ప్రదాతకు ఆత్మీయ స్వాగతం పలికింది. అడుగడుగునా నీరాజనం పలికింది. ఎన్ని అడ్డంకులు సృష్టించినా నీ వెంటే అంటూ ముందుకు నడిచింది. ఏ శక్తీ తమను ఆపలేదంటూ స్పష్టం చేసింది. జగన్ నినాదాలతో మార్మోగించింది.





హెలికాప్టర్ దిగి అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్, అభిమాన నేతను చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

- అనంతలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఘన స్వాగతం
- మాజీ ఎమ్మెల్యే విశ్వ కుమారుడి వివాహ వేడుకకు హాజరైన జననేత
- జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన జన సందోహం
- హెలిప్యాడ్ నుంచి కల్యాణ మండపం వరకు అడుగడుగునా నీరాజనం

అనంతపురం కార్పొరేషన్: ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి కుమారుడు ప్రణయ్ రెడ్డి, సాయి రోహిత వివాహం గురువారం అనంతపురంలోని ఇంద్రప్రస్థ జీఎంఆర్ గార్డెన్స్‌లో జరిగింది. వీరి వివాహానికి హాజరైన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. జననేతను చూసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఉదయం 9 గంటలకే..

హెలీప్యాడ్ వద్దకు ఉదయం 9 గంటల నుంచే ప్రజలు చేరుకున్నారు. తమ అభిమాన నాయకుడు ఎప్పుడెప్పుడు వస్తారా అంటూ ఎదురు చూశారు. వైఎస్ జగన్ హెలికాప్టర్ నుంచి దిగగానే కేరింతలు కొట్టారు. 'అన్న వచ్చాడు' అంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ఈలలు, కేకలు వేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడి నుంచి ఇంద్రప్రస్థ జీఎంఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన పెళ్లి మండపానికి బయలు దేరిన జగన్‌కు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. 'జై జగన్' అంటూ నినాదాలు చేస్తూ కాన్వాయ్ వెంట పరుగులు తీశారు. సంక్షేమ ప్రదాతను చూసేందుకు మహిళలు భారీగా తరలి వచ్చారు. రుద్రంపేట బ్రిడ్జి వద్ద, హెలీప్యాడ్ చుట్టుపక్కల భవనాలు, కల్యాణ మండపం చుట్టుపక్కల భవనాలపైకి ఎక్కి అభివాదం చేశారు.

కిక్కిరిసిన కల్యాణ మండపం..

అభిమానులు, నాయకులు, ప్రజలతో కల్యాణ మండపం పరిసరాలు కిక్కిరిసి పోవడంతో వైఎస్ జగన్ లోపలికి వెళ్లడానికి చాలా సమయం పట్టింది. జగనన్నతో కరచాలనం చేయడానికి అడుగడుగునా ప్రజలు ఉత్సాహం చూపారు. వధూవరులు ప్రణయ్ రెడ్డి, సాయి రోహితను ఆశీర్వదించిన అనంతరం హెలికాప్టర్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు.

సాదర స్వాగతం..

హెలీప్యాడ్ వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. మాజీ మంత్రులు, వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉషశ్రీ చరణ్, పార్టీ సమన్వయకర్తలు డాక్టర్ సాకే శైలజానాథ్ (శింగనమల), మెట్టు గోవింద రెడ్డి(రాయదుర్గం), తలారి రంగయ్య(కళ్యాణదుర్గం),తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి(రాప్తాడు), దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి (పుట్టపర్తి),వై.వెంకటరామిరెడ్డి(గుంతకల్లు) కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి (ధర్మవరం), పెద్దారెడ్డి (తాడిపత్రి), మక్బుల్ (కదిరి), ఈరలక్కప్ప (మడకశిర), ఎన్ఆర్ఐ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మాజీ మంత్రులు ఆర్‌కే రోజా, శంకర్ నారాయణ, మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, గుంటూరు వెస్ట్ సమన్వయకర్త ఫాతిమా నూరి, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



వధూవరులు ప్రణయ్ రెడ్డి, సాయి రోహితలను ఆశీర్వదిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిన జాతీయ రహదారి పరిసరాలు

న్యూస్‌రీల్

పంద్రాగస్టు వేడుకకు వేళాయె




ముస్తాబైన పోలీసు పరేడ్ మైదానం

అనంతపురం అర్బన్: పంద్రాగస్టు వేడుకకు పోలీసు పరేడ్ మైదానం ముస్తాబయ్యింది. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం ఉదయం 9.02 గంటలకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం సాయుధ బలగాల వందనాన్ని స్వీకరించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఉదయం 10 గంటలకు వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, 10.15కు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.40కు విశిష్ట సేవలకు ప్రశంసా పత్రాల ప్రదానం, 11.40 గంటలకు ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్ల సందర్శన ఉంటుంది.

413 మందికి అవార్డులు

విధుల్లో విశిష్ట సేవలు అందించిన 413 మంది అధికారులు, ఉద్యోగులను అవార్డులకు ఎంపిక చేశారు. వీరందరూ మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటారు.

అనంతపురం డీఎస్పీకి విశిష్ట సేవా పురస్కారం



డీఎస్పీ శ్రీనివాస రావు

అనంతపురం: అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాస రావుకు విశిష్ట సేవా పురస్కారం దక్కింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శ్రీనివాస రావు పురస్కారాన్ని అందుకోనున్నారు. 1989లో శ్రీనివాస రావు ఎస్ఐగా ఉద్యోగం పొందారు. 2004లో సీఐగా, 2014లో డీఎస్పీగా పదోన్నతి వచ్చింది. నూజివీడు, కాకినాడ, చీరాల, విజయవాడ ఈస్ట్ డీఎస్పీగా పని చేశారు. ప్రస్తుతం అనంతపురం అర్బన్ డీఎస్పీగా పనిచేస్తున్నారు. గతంలో ఏపీ సేవా, ఉత్తమ సేవా, మహోన్నత, కేంద్ర ప్రభుత్వ అతి ఉత్కృష్ట పతకాలను పొందారు. తాజాగా విశిష్ట సేవా పురస్కారాలను 20 మంది పోలీసు అధికారులకు ప్రకటించగా, వీరిలో వి. శ్రీనివాస రావు ఉండడం గమనార్హం.

కళ్లెదుటే వైకల్యం.. కానరాని కనికరం



కుమారుడు మహిధర్‌తో కలెక్టరేట్‌కు వచ్చిన తల్లిదండ్రులు రాజేశ్వరి, సూర్యనారాయణ

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వంలో దివ్యాంగుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. వైకల్యం కళ్లెదుటే కనిపిస్తున్నా వెరిఫికేషన్ పేరుతో పింఛను నిలిపివేస్తుండంతో అంతులేని ఆవేదన మిగులుతోంది. గుత్తి మండలం శ్రీపురానికి (కొజ్జేపల్లి) చెందిన దంపతులు సూర్యనారాయణ, రాజేశ్వరి తమ దివ్యాంగ (బుద్ధిమాద్యం) కుమారుడు మహిధర్‌ను ఎత్తుకుని గురువారం కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. మహిధర్ వయసు తొమ్మిది సంవత్సరాలని, నిలబడలేడు.. కూర్చోలేడని వాపోయారు. తమ బిడ్డకు ఈ నెల పింఛన్ నిలిపేశారన్నారు. వెరిఫికేషన్ చేయించలేదు.. అందుకే ఆపేశామని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఈ ఏడాది ఏప్రిల్ 16న అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వెరిఫికేషన్ చేయించామని, అయినా పింఛన్ నిలిపేయడంతో మళ్లీ గురువారం ఆస్పత్రికి వచ్చి వెరిఫికేషన్ చేయించినట్లు వెల్లడించారు. మళ్లీ అప్పట్లోలా ఎక్కడ చేస్తారనే భయంతో వెరిఫికేషన్ ప్రక్రియ వీడియో కూడా తీసుకున్నామని చెప్పారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు చెప్పుకుందామని వచ్చినట్లు తెలిపారు. అయితే, ఇన్‌చార్జ్ కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో వారు నిరాశతో వెనుదిరిగారు.

సెంట్రల్ వర్సిటీ వీసీ కోరి పదవీకాలం పొడిగింపు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ డాక్టర్ ఎస్ఏ కోరి పదవీ కాలం ఏడాది పాటు పొడిగించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాల మేరకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సెక్రటరీ గురువారం దీనిపై ఉత్తర్వులు జారీ చేశారు. 2020 ఆగస్టు 20న వీసీగా కోరి నియమితులయ్యారు. ఆగస్టు 19 వరకు పదవీ కాలం ఉంది. పొడిగింపు నేపథ్యంలో మరో ఏడాది కొనసాగనున్నారు.

అభిమానం.. అంతులేని ఆనందం



అన్నొస్తే ఇంతే: కల్యాణ మండపం వద్ద జనసందోహం



జ్ఞాపకం.. పదిలం : సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న ముస్లిం మహిళ



నమస్తే అన్నా: జగన్‌ను చూసిన ఆనందంలో మహిళలు



అన్నను చూడాల్సిందే: జగన్‌ను చూసేందుకు వాహనం పైకెక్కిన అభిమానులు



ఎంతసేపైనా వేచి ఉంటాం: కల్యాణ మండపం వద్ద వేచి చూస్తున్న ప్రజలు



ఒక్క ఫొటో జగనన్నా: సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తున్న యువకులు

ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం

- ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే ఎన్నికలకు సిద్ధమవ్వాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి
- దద్దమ్మ ప్రభుత్వం ఇది: పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతం రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, గౌతం రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు అధికారాన్ని అడ్డు పెట్టుకుని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. బాబు దిగుజారుడు రాజకీయాలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని స్పష్టం చేశారు. గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతం రెడ్డితో కలసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు నిరంకుశంగా పాలన సాగిస్తున్నారన్నారు. వాక్ స్వాతంత్ర్యాన్ని హరించడమే కాకుండా, ఎవరైనా విమర్శించినా, గొంతెత్తినా పోలీసులను అడ్డుపెట్టుకుని అణచి వేయాలనే నీచ రాజకీయాలకు చంద్రబాబు అండ్ కో పాల్పడుతోందని మండిపడ్డారు. ఇప్పటివరకూ తాను ఏడు ఎన్నికల్లో పోటీ చేశానని, ఎన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యాన్ని నేడు నడిరోడ్డులో హత్య చేశారన్నారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరిపారా బాబూ అని ప్రశ్నించారు. ఎన్నికలు జరిగే ప్రాంతంలోని వారితో కాకుండా ఇతర నియోజకవర్గాల నుంచి మనుషులను పిలిపించి దొంగ ఓట్లు వేశారన్నారు. ఉదయం నుంచే అన్ని పోలింగ్ బూత్‌లను హస్తగతం చేసుకుని రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, దొంగ ఓటింగ్ జరిగిందని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని బతికిద్దామన్న ఆలోచనను ఎన్నికల సంఘం చేయకపోవడం దారుణమన్నారు. సాక్షాత్తు కలెక్టర్ ముందే అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. తక్షణం ఎన్నికలను రద్దు చేసి మరోసారి ప్రజాస్వామ్య పద్ధతిలో జరపాలన్నారు. 'కూటమి' ప్రజాప్రతినిధులకు నిజంగా గత ఎన్నికల్లో గెలిచామని నమ్మకం ఉంటే మరోసారి ఎన్నికలకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు.

దద్దమ్మ ప్రభుత్వం..

ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల బరిలోకి దిగాల్సిన కూటమి ప్రభుత్వం దొంగ చాటున ఎన్నికల్లో గెలిచిందని, ఇవాళ ఏదో గెలిచామంటూ చంకలు గుద్దుకుంటున్నారని, ఇది దద్దమ్మ ప్రభుత్వమని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతం రెడ్డి అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహించారన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రాధేయపడ్డా పోలీసులు కనికరించకుండా కూటమి ప్రభుత్వానికి వంత పాడారని దుయ్యబట్టారు. ఇంతకన్నా దారుణమైన పరిస్థితులు మరెక్కడా ఉండవన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు, 3 లక్షల మందికి వలంటీర్లుగా అవకాశం, పరిశ్రమలకు సంబంధించి రూ.47,485 కోట్లతో 28,343 యూనిట్ల ద్వారా రెండున్నర లక్షల మందికి ఉపాధి కల్పించిన గొప్ప వ్యక్తి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఒక్క హామీనైనా కూటమి ప్రభుత్వం సరిగా నెరవేర్చిందా అని ప్రశ్నించారు. ప్రకటించిన పథకాల్లోనూ అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబిలేసు, నాయకులు కొర్రపాడు హుస్సేన్ పీరా, అనిల్‌కుమార్ గౌడ్, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్, కోటేశ్వర్ రెడ్డి, సాకే శివశంకర్, సాకే మణికంఠ, గుజ్జల సర్దార్, సంగమేష్, సంపంగి రాయుడు, గుజ్జల నారాయణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

20 వరకూ 'సుఖీభవ' ఫిర్యాదుల స్వీకరణ

అనంతపురం అగ్రికల్చర్: 'అన్నదాత సుఖీభవ' పథకం కింద సొమ్ము జమ కాని రైతులు ఈనెల 20 లోపు ఫిర్యాదులు సమర్పించాలని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదట 'మనమిత్ర' వాట్సాప్ గ్రూప్ (9552300009)లో ఆధార్ నంబరు ద్వారా 'సుఖీభవ' స్టేటస్ చెక్ చేసుకుంటే ఏ కారణంతో డబ్బు పడలేదనే విషయం తెలుస్తుందన్నారు. ప్రధానంగా 5,809 మంది రైతులకు ఎన్‌పీసీఐ ఇన్‌యాక్టివ్ ఉండగా... 1,432 మంది రైతులవి ఎన్‌పీసీఐ నాట్ మ్యాప్డ్ కింద ఉన్నట్లు తెలిపారు.

నిరుపమాన త్యాగధనులు

తిరుగులేని దేశభక్తే తమ ఆయుధంగా పోరాటం సల్పి భరతమాతను దాస్య విముక్తి కల్గించిన వారిలో అనంత వాసులూ ఎందరో ఉన్నారు. వారి స్ఫూర్తిదాయకమైన పోరాటాల ఫలితంగా... నాటి నుంచి నేటి వరకూ వన్నె తగ్గని జాతీయ పతాకం రెపరెపలాడుతోంది. 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా భారతావని స్వేచ్ఛకు ప్రతిరూపాలుగా నిలిచిన మహనీయులు... స్మారకాల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం..

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన కల్లూరు సుబ్బారావు, తరిమెలనాగిరెడ్డి, పప్పూరు రామాచార్యులు, యర్రమల కొండప్ప వంటి వారే కాకుండా సామాన్యులు సైతం నిరుపమాన త్యాగాలతో ఎంతోమంది దేశం కోసం సర్వమూ అర్పించిన దాఖలాలు అనేకం ఉన్నాయి. తిరుగులేని దేశభక్తే తమ ఆయుధంగా పోరాటాల్లో పాల్గొన్నారు. భరత మాతకు దాస్యవిముక్తి కల్గించిన అనంతరం కూడా తమ ఆస్తిపాస్తులను సమాజానికి అందించి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. వారి త్యాగాలకు ఫలితంగా ఊరూరా వారి విగ్రహాలు ఏర్పాటయ్యాయి.



స్వేచ్ఛావాయువులకు సజీవ చిహ్నం


అనంతపురం నగర నడిబొడ్డున నిలువెత్తు రూపంలో కనపించే టవర్ క్లాక్ స్వాతంత్య్ర సంగ్రామంలో స్వేచ్ఛావాయువులకు సజీవ చిహ్నంగా నిలిచింది. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన నాటికి గుర్తుగా 8 (ఆగస్టు నెల) భుజాలు, 15 (తేదీ) అడుగుల వెడల్పు, 47 (1947) అడుగుల ఎత్తు టవర్‌క్లాక్‌ను నిర్మించారు. 1952లో అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు.

సందర్భం నేడు 79వ స్వాతంత్య్ర దినోత్సవం



దాస్య శృంఖలాల నుంచి భరత మాతకు విముక్తి కలిగిన సందర్భంగా 1947, ఆగస్టు 18న రాయదుర్గంలోని రాణిఛత్రంలో పెద్ద ఎత్తున అన్నదానం జరిగింది. తోట అంజినప్ప, ఆయన కుమారులు వేలాదికి అన్నదానం చేయించిన దృశ్యం నాటి ఆనంద ఘట్టాన్ని నేటి తరానికి చాటిచెబుతోంది. - రాయదుర్గం టౌన్

జాతీయోద్యమంలో 'కల్లూరు' మార్క్



లలిత కళాపరిషత్‌లో ఏర్పాటు చేసిన కల్లూరు సుబ్బారావు విగ్రహం

అనంత స్వాతంత్రోద్యమ చరిత్రలో కల్లూరు సుబ్బారావు ప్రత్యేక భూమికను పోషించారు. 1918లో గాంధీజీ పర్యటనలో ఇచ్చిన ఉపన్యాసానికి ప్రభావితమైన ఆయన... మెట్రిక్యులేషన్‌తో చదువుకు స్వస్తి పలికి జాతీయోద్యమంలో ప్రవేశించారు. జాతీయ స్థాయిలో జరిగిన అనేక సమావేశాలకు రాయలసీమ తరఫున హాజరైన ఏకైక ప్రతినిధిగా ఖ్యాతిగాంచారు. రాయలసీమ ప్రజా ప్రయోజనాల కోసం శ్రీబాగ్ ఒడంబడికలో సంతకం చేసిన వారిలో ముఖ్యులు. స్వాతంత్య్ర సమర యోధుడిగా ఆయనను గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన విలువైన స్థలాన్ని లలిత కళలను ప్రోత్సహించేందుకు ఉదారంగా అందజేశారు. ప్రస్తుతం రూ.కోట్ల విలువ చేసే అనంతపురంలోని ఆ స్థలంలో నిర్మించిన లలిత కళాపరిషత్ ఎంతో మంది కళాకారులకు ఊతమిస్తోంది.

స్వాతంత్య్ర సమరంలో 'దుర్గం' యోధులు



గురుమాల్ నాగభూషణం, దామోదర్‌సింగ్, సత్యభామాదేవి

రాయదుర్గం/టౌన్: రాయదుర్గం ప్రాంతానికి చెందిన ఓబుళాచార్యులు, కెరె శరణప్ప, ఎన్‌సీ శేషాద్రీ, జగన్నాథ్‌సింగ్, నిప్పాణి రంగరావు, వైహెచ్ సుబ్బారావు, సత్యభామాదేవి, మోపూరు చంద్రకాంతనాయుడు, శిరిగేదొడ్డి గ్రామస్తుడు దామోదర సింగ్, నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కట్టరావుప్ప ఇలా ఎంతో మంది దేశభక్తులు, స్వాతంత్య్ర యోధులు భారత స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొని రాయదుర్గం ప్రాంత కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప చేశారు. ప్రముఖ గాంధేయవాది, న్యాయవాది గురుమాల్ నాగభూషణం 1941లో స్వాతంత్య్ర పోరాటంలో అరెస్ట్ అయి 1941 మే 12 నుంచి బీజాపూర్ జిల్లా ఇండాలిగి సెంట్రల్ జైలులో 3 నెలల కారాగార శిక్ష అనుభవించారు. వరదా చెన్నప్ప, తిప్పయ్య 1930లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 3 నెలల కఠిన కారాగార శిక్షను అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు వైహెచ్ సత్యభామాదేవి రెండు నెలల జైలు శిక్ష అనుభవించారు. వ్యక్తిగత సత్యాగ్రహం చేసి ఆర్.నాగన్నగౌడ్ రూ.400లు దండన చెల్లించి ఏడాది కారాగార శిక్ష అనుభవించారు. బసవన్న గౌడు, చిందనూరు నాగప్ప శెట్టి ఇతర ప్రముఖులతో కలసి ఓబుళాచార్యులు తమ వంతు సేవలందించారు. వీరి జ్ఞాపకార్థం రాయదుర్గం పట్టణంలోని ఒక రోడ్డుకు ఓబుళాచారి రోడ్డు అని నామకరణం చేశారు.

74 ఉడేగోళం గ్రామంలో స్మృతి చిహ్నం



గాంధీజీ పిలుపు మేరకు దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో రాయదుర్గం నియోజకవర్గం నుంచి అనేక మంది పాలు పంచుకున్నారు. వారి పోరాటానికి గుర్తుగా 1972–73లో పంచాయతీ సమితి ఆధ్వర్యంలో రాయదుర్గం మండలం 74 ఉడేగోళం గ్రామంలో స్మారక చిహ్నం ఏర్పాటు చేశారు. ఇందులో స్వాతంత్య్ర సమరయోధులు ఎం.వీరయ్య, వైహెచ్ సుబ్బారావు, సత్యభామాదేవి పేర్లను ముద్రించారు.

చిరస్మరణీయుడు 'యర్రమల'



దేశం పట్ల అచంచల భక్తివిశ్వాసాలున్న యర్రమల కొండప్ప త్యాగం చిరస్మరణీయం. 1890లో ఓ గొప్ప భూస్వామ్య కుటుంబంలో జన్మించి, విద్యావంతుడై పోలీసు శాఖలో పనిచేశారు. ఆ రోజుల్లోనే గుంతకల్లు సభలో బాల గంగాధర్ తిలక్ ఉపన్యాసంతో ప్రభావితుడైన ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసి స్వాతంత్య్ర సమరంలో చురుకుగా పాల్గొంటూ వచ్చారు. ఈ క్రమంలో 1921లో బ్రిటీష్ సైనికులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించారు. 1934లో మహాత్మాగాంధీ అనంతకు విచ్చేసిన సమయంలో హరిజనోద్ధరణ పిలుపునకు ప్రభావితుడై అదే స్ఫూర్తితో అనంతపురంలోని అశోక్ నగర్‌లో ఎంతో విలువైన రెండు ఎకరాల భూమిని ధారాదత్తం చేశారు. ఆ స్థలంలోనే ప్రస్తుతం అంబేడ్కర్ భవనం నడుస్తోంది.

నాటి మధుర స్మృతి



గంగవరంలో 1947లో నిర్మించిన స్వాతంత్య్ర స్మారక స్థూపం

బెళుగుప్ప: మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన కృష్ణమూర్తిరావు స్వాతంత్య్ర ఉద్యమంలో తన వంతు పాత్రను పోషించారు. ఆయన పోరాటాలకు గుర్తుగా దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 1947, ఆగస్టు 15న గంగవరం గ్రామ నడిబొడ్డున నాటి గ్రామ పెద్దలు, తన మిత్రులు లింగప్ప, శ్రీనివాసులు, శ్రీశైలప్ప మరి కొందరు గ్రామస్తులతో కలసి కృష్ణమూర్తిరావు ఓ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేశారు. నాటి మధుర స్మృతిని నేటికీ ఆ గ్రామస్తులు ఎంతో అపురూపంగా చూసుకుంటున్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య



మృతుడు రాజేష్

పెద్దవడుగూరు: క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరులోని నరసింహ కాలనీలో నివాసముంటున్న రాజేష్ (23)కు ఇటీవల అదే గ్రామానికి చెందిన అరుణతో వివాహమైంది. తరచూ అరుణను తల్లి పుట్టింటికి పిలుచుకెళుతుండడంతో క్షణికావేశానికి లోనైన రాజేష్.. గురువారం తెల్లవారుజామున కాలనీ సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఎస్‌ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జిల్లాకు 1,950 మెట్రిక్ టన్నుల ఎరువులు



రేక్‌పాయింట్‌లో ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ జీఎం అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం అగ్రికల్చర్: ఇఫ్కో కంపెనీకి చెందిన 1,200 మెట్రిక్ టన్నుల డీఏపీ, 750 మెట్రిక్ టన్నుల 20–20–0–13 రకం కాంప్లెక్స్ ఎరువులు జిల్లాకు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ జీఎం అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన ఎరువులను ఆయన గురువారం పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం ఎరువులను మార్క్‌ఫెడ్‌కు, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఖైదీ మృతిపై 18న ఆర్డీఓ విచారణ

ధర్మవరం అర్బన్: ఈ ఏడాది జనవరి 14న అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ ధర్మవరం సబ్‌జైల్‌లోని రిమాండ్ ఖైదీ మృతి చెందిన అంశంపై ఈ నెల 18న ఆర్డీఓ విచారణ చేపట్టనున్నారు. ఈ మేరకు ఆర్డీఓ మహేష్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పామిడి మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన కాడింటి కేశవనారాయణ అలియాస్ శివయ్య ఉరఫ్ శ్రీనివాసులు(50) ధర్మవరం సబ్ జైలులో రిమాండ్ ఖైదీ (నం.1254)గా ఉండేవాడు. అనారోగ్యంతో బాధపడుతుండగా సర్వజనాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందిన అంశంపై విచారణ చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ నెల 18న ఉదయం 11గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో విచారణ ఉంటుందని, దీనిపై అక్షేపణలున్నవారు అఫిడవిట్ రూపంగా కానీ, ప్రత్యక్షంగా కాని అందజేయాలని ఆర్డీఓ కోరారు.

బైక్ ఢీ – క్లీనర్ మృతి

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ బస్సు క్లీనర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుందుర్పి మండలం తెనగల్లు గ్రామానికి చెందిన ఆనంద్ (38)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఓ ప్రైవేట్ బస్సుకు క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం కళ్యాణదుర్గంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డు దాటుతుండగా వేగం వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఆనంద్‌ను ఢీకొన్నాడు. ఆనంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనదారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు ఆనంద్‌ను వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి, అక్కడి నుంచి కర్నూలుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అది దొంగ ఓట్ల విజయం

- ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ
- పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో అధికార పార్టీతో పోలీసులు కుమ్మక్కు
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడు రూరల్: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ దొంగ ఓట్లతో సాధించిన గెలుపు ఓ గెలుపు కాదని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి దానిపై పేలాలు ఏరుకున్నారంటూ ధ్వజమెత్తారు. ఎన్నికలు సజావుగా నిర్వహించాల్సిన పోలీసులు, పోలింగ్ సిబ్బంది అధికార పార్టీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. పోలింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంటన్లు కూడా కూర్చోనివ్వలేదన్నారు. పులివెందులలో ప్రజాస్వామ్యం వర్ధిల్లిందంటూ మంత్రి లోకేష్ చేసిన ట్వీట్‌లో దొంగ ఓట్లు వేసిన వేరు అడ్డంగా దొరికిపోయారన్నారు. కలెక్టర్ ఉన్న బూత్‌లోనూ దొంగ ఓట్లు వేశారంటే ఈ ఎన్నికలు ఎంత హీనంగా జరిగాయో అర్థమవుతోందన్నారు. జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేశారనేందుకు ప్రభుత్వం విడుదల చేసిన వీడియోలు, ఫొటోలే నిదర్శనమన్నారు. పోలింగ్ బూత్‌ల్లో చేసిన వెబ్‌కాస్టింగ్, బూత్‌ల బయట సీసీ పుటేజీలు పూర్తి స్థాయిలో ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. చోటు చేసుకున్న అక్రమాలపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని ఆధారాలు, సాక్ష్యాలను బయట పెట్టినా ఇప్పటి వరకూ చర్యలు తీసుకోలేదన్నారు. దొంగ ఓట్లు వేసిన వారిని విచారిస్తే ఈ అక్రమాలకు సూత్రధారులు, పాత్రధారులు బయట పడతారన్నారు. ఫిర్యాదు చేసినా ఎన్నికల సంఘం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడం లేదన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థలు ఇలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈ తీరు ప్రజాస్వామ్యానికే పెనుముప్పు అని హెచ్చరించారు.

హడావుడి కౌంటింగ్ ఎందుకో?

ఉప ఎన్నికలను రద్దు చేసి కేంద్ర బలగాల ఆధ్వర్యంలో తిరిగి ఎన్నికలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ హైకోర్టును ఆశ్రయించిందన్నారు. ఈ నేపథ్యంలో హడావుడిగా పులివెందుల ఫలితాన్ని ప్రకటించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. హైకోర్టు తమకు వ్యతిరేకంగా ఆదేశాలిస్తుందనే భయంతో ఎక్కువ టేబుళ్లు వేసి ఒకే రౌండ్‌లో మొత్తం ప్రక్రియను పూర్తి చేశారన్నారు. చంద్రబాబుకు నిజంగా అంతటి ప్రజాబలం ఉందనుకుంటే ఇంత దౌర్జన్యం చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందన్నారు. ఆయనకు ధైర్యం ఉంటే తాజా ఎన్నిక కోసం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ బలగాల సమక్షంలో ఎన్నికల నిర్వహణకు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

కన్నతల్లి కళ్ల ముందే...

- రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి




అఫ్రీన్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: స్థానిక విద్యానగర్ రోడ్డు నంబర్ 1లో నివాసముంటున్న ఖాదర్‌వలి, షేక్ హసీనా బేగం దంపతుల ఒక్కగానొక్క కుమార్తె షేక్ అఫ్రీన్ (12) స్థానిక ఓ కార్పొరేట్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. రైల్వే కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ ఖాదర్‌వలి తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తిమ్మాపురం సమీపంలో ఉంటున్న తన తల్లిదండ్రుల ఇంటికి గురువారం మధ్యాహ్నం కుమార్తె అఫ్రీన్‌తో కలసి స్కూటీపై హసీనా బేగం బయలుదేరింది. పారిశ్రామిక వాడ సమీపంలోని చాక్‌లెట్ ఫ్యాక్టరీ వద్ద స్పీడ్ బ్రేకర్ వద్ద వేగాన్ని తగ్గిస్తూ ముందుకు పోతుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ స్కూటీని ఢీకొంది. ఘటనలో తల్లి కుడి పక్కకు ఎగిరి పడగా... అఫ్రీన్ మాత్రం ఎడమ వైపు రోడ్డుపై పడింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ బ్రేక్ వేయకపోవడంతో లారీ చక్కాలు అఫ్రీన్‌ను తొక్కుకుంటూ ముందుకెళ్లాయి. ఘటనలో అఫ్రీన్ సగం శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడిన తల్లి హసీనా బేగం షాక్ నుంచి కోలుకొని వెంటనే కుమార్తె కోసం గాలించింది. ఆమె కళ్లకు రక్తపు మడుగులో విగత జీవిగా కుమార్తె కనిపించడంతో రోదనకు అంతులేకుండా పోయింది. మాంసపు ముద్దలా మారిన కుమార్తెను గుండెలకు హత్తుకుని గుండెలవిసేలా రోదించసాగింది. విషయం తెలుసుకున్న తండ్రి ఖాదర్‌వలి కూడా అక్కడకు చేరుకుని ఆమెకు తోడవడంతో పరిస్థితి హృదయవిదారకంగా మారింది. ఈ దృశ్యం చూసిన వాళ్లు సైతం కంటనీరు పెట్టారు. సమాచారం అందుకున్న గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన

- సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయడం లేదని మండిపడ్డారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ సహాయ కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డితో కలసి విలేకరులతో ఆయన మాట్లాడారు. మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు చంద్రబాబు, లోకేష్ పిలుపునిచ్చారని, ప్రస్తుతం అధికారం చేపట్టిన తరువాత ఇదే పెద్ద మనుషులు మాట తప్పి స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. విద్యుత్ చార్జీలో పెంచబోమని, మరింత తగ్గిస్తామని ఎన్నికల్లో చెప్పి... అధికారంలోకి వచ్చిన తరువాత ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై ఏకంగా రూ.15,400 కోట్లు భారం మోపారని దుమ్మెత్తిపోశారు. హామీల సాధనకు ఉద్యమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. జిల్లా అభివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర కార్యదర్శి శ్రీరాములు, నాయకులు రాజేష్‌గౌడ్, రమణ, రామకృష్ణ, నారాయణస్వామి, కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా వెతలు!

బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో ఆర్‌ఎస్‌కే వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు




ఈసారి హెచ్చెల్సీకి ముందుగానే నీరు రావడం ఖరీఫ్ ముందస్తులోనే వర్షాలు కురువడంతో రైతులు వరి, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యూరియా అవసరం ఎక్కువైంది. అయితే యూరియా కొరత రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అయినా యూరియా కొరత లేదంటూ ప్రభుత్వ పెద్దలతో పాటు జిల్లా వ్యవసాయాధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. యూరియా దొరుకుతోందని తెలియగానే ఆర్‌ఎస్‌కేల వద్దకు రైతులు, మహిళా కూలీలు పరుగు తీస్తున్నారు. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్, ఉంతకల్లు గ్రామాలు, కణేకల్లులోని ఆర్‌ఎస్‌కేల వద్ద గురువారం 6 గంటల నుంచి పడిగాపులు కాసినా యూరియా అందక కొందరు రైతులు నిరాశతో వెనుదిరిగారు. – బొమ్మనహాళ్/కణేకల్లు:



కణేకల్లు ఏఓ కార్యాలయం వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

త్రివర్ణశోభితం.. రైల్వేస్టేషన్ భవనం



త్రివర్ణ వెలుగుల్లో ముస్తాబైన గుంతకల్లు రైల్వేస్టేషన్ భవనం


గుంతకల్లు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంతకల్లులోని రైల్వేస్టేషన్ భవనం త్రివర్ణ శోభితమైంది. కాషాయ, తెలుపు, ఆకుపచ్చ విద్యుద్దీపాలతో భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన భారీ త్రివర్ణ పతాకం రెపరెపలు మరింత అందాన్ని తెచ్చిపెట్టింది.

స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం

- హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో డీఆర్‌ఎం

గుంతకల్లు: స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ.. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాలంటూ డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పిలుపునిచ్చారు. గుంతకల్లు డివిజన్ రైల్వే ఉద్యోగుల ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఆర్‌ఎం సీఎస్ గుప్తా ప్రారంభించారు. స్టేషన్ రోడ్డు, ప్రధాన రహదారి, ఆర్టీసీ బస్టాండ్, బీరప్పగుడి, హనుమాన్ సర్కిళ్ల మీదుగా తిరిగి రైల్వే స్టేషన్‌కు ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీఎంఇ మంగచార్యులు, ఆర్‌పీఎఫ్ డీసీ ఆకాష్ జైస్వాల్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఎంఎం సాదిక్, సీనియర్ డీపీఓ కో ఆర్డినేషన్ హెచ్‌ఎల్‌ఎన్ ప్రసాద్, సీనియర్ డీఈఎన్ కో ఆర్డినేషన్ జీబీ శ్రీనివాసులు, ఆర్‌పీఎఫ్‌లు పాల్గొన్నారు. అలాగే శ్రీశంకరనందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు పాల్గొన్నారు.

భర్త వేధింపులకు గర్భిణి బలి



శ్రావణి (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: భర్త వేధింపులు తాళలేక ఓ గర్భిణి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గంలోని దొడగట్ట రోడ్డులో నివాసముంటున్న నాగరాజు, రామాంజినమ్మ దంపతుల కుమార్తె శ్రావణి(24)కి గండ్లప్ప దొడ్డికి చెందిన బోయ శివన్న, కెరెమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాసులుతో వివాహమైంది. వీరికి రెండేళ్ల వయసున్న కుమార్తె ఉంది. ప్రస్తుతం శ్రావణి మూడు నెలల గర్భిణి. కొన్ని రోజులుగా దంపతుల మధ్య మనస్పర్థలు చెల రేగాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం శ్రావణిపై భర్తతో పాటు అత్త, మామ దాడి చేసి, పుట్టింటికి పంపారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె గురువారం పుట్టింట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

దేశభక్తిని చాటుకోండి



రాప్తాడులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాప్తాడు: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి పేర్కొన్నారు. ప్రభుత్వ జిల్లా స్థాయి విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. స్వాతంత్య్ర వేడుకలలో భాగంగా ప్రజలందరూ మమేకం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రతి ఇంటిపై మూడు రంగుల జెండాను ఎగురవేయాలని కోరారు. జాతీయ జెండాపై గౌరవ భావం కలిగి ఉండి ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు పురుషోత్తం

అనంతపురం: నగరంలోని తపోవనం సర్కిల్ ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన పురుషోత్తం (40) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కలెక్టరేట్ సమీపంలోని పెన్నార్ భవనం ఎదురుగా పెయింట్ షాపు నిర్వహిస్తున్న పురుషోత్తం కొంత కాలంగా భార్యకు దూరంగా ఉంటూ తొమ్మిదేళ్లుగా విడాకుల కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో తనకు పరిచయమైన సచివాలయ మహిళా పోలీసుతో కొంత కాలంగా సహజీవనం సాగిస్తున్నాడు. వ్యాపారం కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో కొనుగోలు దారులు సకాలంలో డబ్బు చెల్లించకపోవడంతో అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.20 లక్షలు చేరుకుంది. ఇటీవల వడ్డీ వ్యాపారుల వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో మనస్తాపం చెందిన పురుషోత్తం గురువారం తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

స.హ. చట్టంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న డీసీఓ అరుణ కుమారి, సహకార శాఖ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఈ.అరుణకుమారి అన్నారు. గురువారం స్థానిక సహకార శాఖ కార్యాలయం నుంచి టవర్‌క్లాక్ వరకు సహ చట్టంపై అవగాహన నిమిత్తం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడారు. అవినీతి, అక్రమాల నివారణ, ప్రభుత్వ ఉద్యోగుల్లో జవాబుదారీతనం, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం గురించి తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందన్నారు. దీని గురించి ఉద్యోగ వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు తెలుసుకుంటే సమాజాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ క్రమంలో అవగాహన నిమిత్తం డీసీసీబీ, డీసీఎంఎస్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం: నగరంలోని మేడా పెట్రోల్ బంక్ వెనుక ఉన్న వెంకట స్వామి వీధిలో ఒక ఇంట్లో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై గురువారం టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, సిబ్బంది దాడి చేశారు. వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న వల్లం శెట్టి పుల్లమ్మతో పాటు విటులు పెద్దినేని వెంకట పతి, మన్నల నాగరాజు, జోస్తి పెద్దిరెడ్డిని అరెస్ట్ చేశారు. అందులో ఉన్న నలుగురు మహిళా బాధితురాళ్లను కాపాడారు. నిర్వాహకురాలు, విటులపై కేసు నమోదు చేశారు.

బహిరంగ ప్రకటన

[illegible]

రామ..రామ.. ఇదేమి చోద్యం



- సీఎంఓకు చీఫ్ ఫార్మసిస్టు ఆఫీసర్ పోస్టు కేటాయింపు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సూపరింటెండెంట్
- నిబంధనలకు విరుద్ధంగా ఓ మెడికల్ ఆఫీసర్‌కు పోస్టు కట్టబెట్టిన వైనం
- రోగుల ప్రాణాలతో అధికారుల ఆటలు

అనంతపురం మెడికల్: రామ..రామ.. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం తీసుకుంటున్న నిర్ణయాలు దబిడి దిబిడే అనిపిస్తున్నాయి. రూల్ పొజిషన్‌కు విరుద్ధంగా చీఫ్ ఫార్మసిస్టు ఆఫీసర్ పోస్టులో ఇది వరకే ఉన్న డాక్టర్ గౌస్ స్థానంలో క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ)గా ఉన్న డాక్టర్ కౌసర్ బేగంను నియమించడం చర్చనీయాంశమైంది. తొలుత ఈనెల 12వ తేదీన ఉత్తర్వులు జారీ చేసినట్లు నమోదు చేశారు. అయితే మళ్లీ ఈనెల 13 తేదీ వేసి ఆఫీస్ కార్యాలయం నుంచి ఉత్తర్వులను పంపించారు. వాస్తవంగా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ చీఫ్ ఫార్మసిస్టు ఆఫీసర్‌గా ఉన్న ఓ ఫార్మసిస్టు గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. సర్వజనాస్పత్రిలో 11 మంది రెగ్యులర్, 9 మంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఫార్మసిస్టులు విధులు నిర్వర్తిస్తున్నారు. వాస్తవంగా వీరిలో సీనియర్ ఫార్మసిస్టులను మాత్రమే ఈ పోస్టులో ఉంచాలి. కానీ సర్వజనాస్పత్రిలో ఇష్టారాజ్యంగా ఓ మెడికల్ ఆఫీసర్‌కు పోస్టును కేటాయించారు.

క్యాజువాలిటీలో ఆరుగురితో సేవలు

వాస్తవంగా క్యాజువాలిటీలో ఇప్పటికే సీఎంఓల కొరత ఉంది. అందులో పని చేసే నలుగురిని ఇటీవల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి పంపారు. కాగా ప్రస్తుతం 6 మందితోనే క్యాజువాలిటీ నడుస్తోంది. క్యాజువాలిటీకి రోజూ 500 నుంచి 800 మంది వరకు ఓపీ ఉంటుంది. దీంతో పాటుగా పదుల సంఖ్యలో అడ్మిషన్ కేసులు ఉంటాయి. యాక్సిడెంట్స్, పాయిజన్, తదితర ఎంఎల్‌సీ కేసులకు సీఎంఓలదే కీలక పాత్ర. క్యాజువాలిటీకి వచ్చే కేసులన్నీ ప్రమాదకర స్థితిలో వస్తుంటాయి. ఇంకా క్యాజువాలిటీలో వైద్యుల కొరత తక్కువగా ఉందని కొందరు సీఎంఓలు లబోదిబోమంటున్నా.. ఆస్పత్రి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రోగులకందించే సేవల్లో నాణ్యత పెంచే ఆలోచనను ఏమాత్రం చేయడం లేదు. సీఎంఓలకు కేటాయించిన విధులకు కాకుండా రాష్ట్రంలోనే ఏ బోధనాస్పత్రిలో లేని విధంగా ఇక్కడ అధికారులు తీసుకున్న నిర్ణయాలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. అందుబాటులో ఉన్న సీనియర్ ఫార్మసిస్టులకు అవకాశం కల్పించకుండా సూపరింటెండెంట్ ఎందుకు వైద్యులకు పోస్టులను కేటాయిస్తున్నారో అర్థం కావడం లేదు.

ఆందోళనలో ఫార్మసిస్టులు..

గతంలోనూ ఓ ఫార్మసిస్టు చీఫ్ ఫార్మసిస్టు ఆఫీసర్‌గా పని చేశారు. ఇప్పుడు ఎందుకు ఆ పోస్టును వైద్యులకు కేటాయిస్తున్నారో అర్థం కావడం లేదు. గతంలో ఏమైనా తప్పిదాలు, అక్రమాలు జరిగాయా? ఒక వేళ అవి ఏమైనా బయట పడకూడదన్న ఆలోచనతో ఆస్పత్రి అధికారులు పోస్టును ఫార్మసిస్టులకు కేటాయించడం లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎవరికి కేటాయించిన పోస్టుల్లో వారిని నియమించకపోవడంతో భవిష్యత్తులో ఓ ప్రశాంత వాతావరణం లేకుండా పోయే పరిస్థితి రానే వస్తుందని ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది.



విద్యుత్ వెలుగుల్లో ఇస్కాన్ మందిరం

• ఇస్కాన్ ముస్తాబు

- శ్రీకృష్ణాష్టమికి ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి మూడు రోజుల పాటు వేడుకలు

అనంతపురం కల్చరల్: అనంతలో ఇస్కాన్ వేదికగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మూడు రోజుల పాటూ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ దామోదర గౌరందదాసు ప్రభు తెలిపారు. గురువారం మందిర ప్రాంగణంలో జరిగిన సమావేశంలో కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 15వ తేదీ తెల్లవారు జామునే ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 10 గంటలకు యజ్ఞసేవ, హరినామ సంకీర్తన, సాయంత్రం తులసి అర్చన, హనుమద్ వాహన సేవ, అనంతరం సాంస్కృతిక సంబరాలు, ఉట్టికొట్టు ఉత్సవం, ఊంజల సేవ ఉంటాయని తెలిపారు. 16న ఉదయం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా దర్శన హారతి, గురుపూజ, సాయంత్రం 5 గంటలకు గరుడ వాహన సేవ, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి దీపోత్సవం, అర్ధరాత్రి 12 గంటలకు మహాపుష్పాభిషేకం జరుగుతాయన్నారు. 17న ఇస్కాన్ వ్యవస్థాపకుడు ఆచార్య భక్తివేదాంత స్వామి శ్రీలప్రభుపాదుల వారి ఆవిర్భావం సందర్భంగా గురువుకు మహా అభిషేకం, మధ్యాహ్నం అన్నదాన సేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 16న సాయంత్రం లలిత కళాపరిషత్తు వేదికగా సాయిగోకులం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి విజయ్‌కుమార్ తెలిపారు. చిన్నారులకు కృష్ణుడి, గోపికల వేషధారణలు, అనంతరం బహుమతులు అందజేస్తామన్నారు.

'దగ్గుపాటి అవినీతిని బయటపెడతాం'

అనంతపురం అర్బన్: 'నగరంలో 15 నెలలుగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అనుచరులు భూకబ్జాలు, అక్రమ వసూళ్లు, దాందాలు చేస్తున్నారు. ప్రజా క్షేత్రంలో ఎమ్మెల్యే అవినీతిని బయపెటడతాం. ఎమ్మెల్యే, ఆయన అనుచరుల కారణంగా దౌర్జన్యానికి గురైన బాధితులకు అండగా ఉంటాం' అని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడారు. ఎమ్మెల్యే అనుచరులు రౌడీయిజం, దౌర్జన్యాలు, భూకబ్జాలు, చికెన్ షాపు నుంచి వైన్ షాపు వరకు అక్రమ దందాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే చేత దౌర్జన్యానికి గురైన బాధితులకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు అల్లీపీరా, రమణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్, నాయకులు చాంద్‌బాషా, మునాఫ్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ప్రొఫెసర్లకు పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న నారాయణ రెడ్డి

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో పనిచేస్తున్న నలుగురు ప్రొఫెసర్లు ఐఎస్‌టీఈ (ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు పురస్కారాలకు ఎంపికయ్యారు. సైన్స్ అండ్ హ్యూమానిటీస్ కేటగిరీలో డాక్టర్ టి. నారాయణ రెడ్డి, కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ బి. దిలీప్ కుమార్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కే. కళ్యాణి రాధ, కెమికల్ ఇంజినీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శారద ఎంపికైన వారిలో ఉన్నారు. మదనపల్లిలోని మిట్స్ కళాశాలలో గురువారం ఐఎస్‌టీఈ ఇండియా చైర్మన్ ప్రతాప్ సింగ్ కే.దేశాయ్, జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు.



మాంటిస్సోరి స్కూల్‌లో వేడుకలు



సాయి విజ్ఞాన్ స్కూల్‌లో..

కృష్ణాష్టమి సందడి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని వివిధ స్కూళ్లలో గురువారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. అందమైన రంగవల్లులు, మామిడి తోరణాలు, గోపాలుడి పాదముద్రలు, వెన్నకుండలతో పాఠశాలలను సుందరంగా అలంకరించారు. పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు గోపిక, కృష్ణుడి వేషధారణలతో అలరించారు.



శ్రీచైతన్యలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



శ్రీరామకృష్ణ విద్యాలయంలో చిన్నారుల కోలాహలం

అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ కీలకం



అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: 'పట్టణాలు, నగరాల సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ కీలకం. రూపొందించిన ప్లాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించి వారి అభిప్రాయం సేకరించాలి' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. అహుడా పరిధిలోని ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, మాస్టర్ ప్లాన్, లే అవుట్ల రిజిస్ట్రేషన్ స్కీమ్ అంశాలపై గురువారం తన క్యాంపు కార్యాలయంలో అహుడా కార్యదర్శి జి.రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ నివాస, పారిశ్రామిక, వాణిజ్య, మౌలిక, వినోద రంగాల్లో అభివృద్ధి పనులను రూపొందిస్తూ నగర, పట్టణ దీర్ఘకాలిక వ్యూహాన్ని నిర్దేశిస్తుందన్నారు. భూమి వినియోగం, రవాణా, రహదారి విస్తరణ, మౌలిక సదుపాయాల ప్రణాళిక, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగర, పట్టణ రూపకల్పనకు దోహదపడుతుందన్నారు. అహుడా పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుత్తి పురపాలక సంఘాల పరిధిలో ముసాయిదా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి వారి అభిప్రాయం తీసుకోవాలని ఆదేశించారు. లే అవుట్లు, ప్లాట్లు 2025, జూన్ 30 కంటే ముందు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు ఎల్‌ఆర్‌ఎస్–2020 (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కింద క్రమబద్ధీకరణకు 90 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాల చార్జీలపై 50 శాతం సడలింపు వర్తిస్తుందన్నారు. ప్రకటన తేదీ నుంచి 45 రోజుల్లోపు చెల్లిస్తే జరిమానా చార్జీలపై 10 శాతం రాయితీ, 90 రోజుల్లో చెల్లిస్తే 5 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. సమావేశంలో అహుడా ప్లానింగ్ అధికారి ఇషాక్, ఇంజినీరింగ్ అధికారులు దుష్యంత్, హరీష్, రేవంత్ ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గుంతకల్లు రూరల్: పశువుల ఆరోగ్యంపైన రైతులు ప్రత్యేక దృష్టిని సారించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా జేడీ టీవీ సుధాకర్ సూచించారు. పశువులకు వ్యాపించే గర్భకోశ వ్యాధులను గుర్తించి వాటికి చికిత్సను అందించే క్రమంలో భాగంగా గురువారం మండలంలోని కసాపురంలో పశుసంవర్ధక శాఖ పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన ఎదకురాని పశువులను, కట్టని పశువులను గుర్తించి చికిత్స అందజేశారు. లింగ నిర్ధారిత వీర్యంపై రైతులకు అవగాహన కల్పించడమే కాకుండా, వాటి ప్రాముఖ్యతను వివరించారు.

బైక్ చోరీ

అనంతపురం: నగరంలోని 80 ఫీట్ రోడ్డులో అయ్యప్ప స్వామి ఆలయం వద్ద గురువారం ఓ బైక్ చోరీకి గురైంది. వివరాలు.. బెళుగుప్ప మండలానికి చెందిన తిప్పేస్వామి ఈనెల 13 సాయంత్రం ఆరు గంటలకు అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో జరిగిన ఓ శుభకార్యానికి వచ్చాడు. అక్కడే బైక్ (హీరోహోండా షైన్ ఏపీ39డీటూ 2274) పార్క్ చేశాడు. తిరిగి 14వ తేదీ మధ్యాహ్నం బయటకు వచ్చి బైక్‌ను పరిశీలించగా, కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో బైక్‌ను చోరీ చేసినట్లు గ్రహించిన బాధితుడు.. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నైపుణ్యాలుంటే ఉద్యోగాలు పుష్కలం



రూహిబానును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుతో పాటు మంచి నైపుణ్యాలు కలిగి ఉంటే ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయని జెడ్ఎస్ అకాడమీ యూనివర్స్ లింగో ఏఐ లిమిటెడ్ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ రూహిబాను అన్నారు. గురువారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) ఏఐ అండ్ ఎంఎల్ విభాగాలు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్‌తో కలసి కెరీర్ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్ఎస్ అకాటడమీ యూనివర్స్ లింగో ఏఐ ఆమె మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఏఐ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చార్టర్డ్ ఇంజినీర్ పక్రుద్దీన్ మహమ్మద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, డాక్టర్ చిత్రలింగప్ప, డాక్టర్ వీర ప్రకాష్, డాక్టర్ భార్గవరెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.